06ATP27_06ATP27.qxd 26-06-2024 PM 10:48 Page 1



# అన్యాయంగా గ్రూప్ లీడర్‌గా తొలగించి ఆసరా, స్త్రీనిధి డబ్బులు కాజేశారు..!

- వైకేపీ కార్యాలయం ముందు మహిళా సంఘం గ్రూప్ లీడర్ ఆందోళన - తనకు నాయ్యం చేయకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదన - తాను టీడీపీలో తిరుగుతున్నానని కక్షకట్టి ఇలా చేశారని మండిపాటు

ఉరవకొండ, జూన్ 26 ప్రభాతవార్త


వైకేపీ కార్యాలయం ముందు బైటాయించి ఆందోళన చేస్తున్న స్వయం సహాయ సంఘం గ్రూప్ లీడర్ ఆర్.తులసి


సీసీ నారాయణస్వామిను నిలదీస్తున్న తులసి

తాను తెలుగుదేశం పార్టీలో తిరుగుతున్నానన్న కారణంగా తనకు తెలియకుండా గ్రూప్ లీడర్‌గానే కాకుండా సంఘం సభ్యురాలిగా కూడా తొలగించడంతోపాటు తనకు రావాల్సి ఆసరా, స్త్రీనిధి పొదుపు డబ్బులను కాజేశారని తనకు న్యాయం చేయాలంటూ ఉరవకొండ పట్టణానికి చెందిన శ్రీసాయి మహిళా సంఘం (ఎస్‌హెచ్‌జీ) గ్రూప్ లీడర్ ఆర్.తులసి మంగళవారం పట్టణంలోని వైకేపీ కార్యాలయం ముందు బైటాయించి ఆందోళన చేపట్టింది. బాధిత ఆర్.తులసి తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే... 2003 నుండి తాను శ్రీ సాయి మహిళా సంఘంలో ఉంటూ గ్రూప్ లీడర్‌గా సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహిస్తున్నానని అయితే తాను టీడీపీకు సానుభూతిపరురాలిని కావడంతో మాజీ ఎంపీపీ చందా చంద్రమ్మ సూచనల మేరకు సీసీ నారాయణస్వామి తనకు తెలియకుండా సంతకాలు ఫోర్జరీచేసి తనను గ్రూప్ లీడర్‌గానే కాకుండా సంఘం సభ్యురాలిగా కూడా సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ముందే తొలగించారని ఆర్.తులసి వాపోయింది. గుండె జబ్బుతో తాను కొంత కాలం ఆసుపత్రిలో ఉండటం ద్వారా తనకు ఈ విషయం తెలియలేదని తెలిసిన తరువాత వచ్చి అడిగితే ఎవరూ పట్టించుకోకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకొంటున్నారన్నారు. తనకు ఆసరా పథకం కింద వచ్చిన డబ్బును మా అత్త ఖాతాలో జమ చేయమంటే గ్రూప్‌లో సభ్యురాలిగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త గీత ఖాతాలోకి జమ చేశారన్నారు. సీసీ నారాయణస్వామి, అంగన్‌వాడీ కార్యకర్తల గీత, ఆనిమేటర్ రబియాలు కలిసి కుమ్మక్కై ఈ తతంగం అంతా నడిపారన్నారు. తనకు రావాల్సిన ఆసరా డబ్బు, స్త్రీ నిధి పొదుపు డబ్బును, 75వేల రూపాయల వరకు సంఘం డబ్బును స్వాహా చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. తనను తిరిగి గ్రూప్ లీడర్‌గా పునరుద్ధరించి నాకు రావాల్సిన డబ్బును తిరిగి చెల్లించకుంటే ఈ కార్యాలయం ముందే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని వాపోయింది. ఈ క్రమంలోనే కార్యాలయంలో ఉన్న సంబంధిత సీసీ నారాయణస్వామిను బాధితురాలు ఆర్.తులసి నిలదీయగా ఆయన సమాధానం చెప్పకుండా పక్కకు వెళ్లిపోయాడు. ఈ విషయమై డీఆర్‌డీఏ అధికారులు సమగ్ర విచారణ చేసి బాధితురాలికి న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# దోమల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టండి

- పారిశుద్ధ్య పనుల పరిశీలనలో ఎంపీడీఓ జి.వి.సుబ్బరాజు

ఉరవకొండ, జూన్ 26 ప్రభాతవార్త


డ్రైనేజీను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జి.వి.సుబ్బరాజు, ఈఓఆర్‌డీ పి.చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్

సీజినల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులను మెరుగుపర్చి దోమల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ జి.వి.సుబ్బరాజు సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని శివరామిరెడ్డి, డ్రైవర్స్, ఎస్‌ఎల్‌ఎన్ కాలనీలు, అంబేద్కర్ నగర్‌లోని డ్రైనేజీ వ్యవస్థలు, పారిశుద్ధ్య కార్యక్రమాలను ఈఓఆర్‌డీ పి.చంద్రమౌళి, మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జి.వి.సుబ్బరాజు మాట్లాడుతూ ప్రతిరోజూ డ్రైనేజీలను శుభ్రం చేయాలని, మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఫాగింగ్ చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిను సూచించారు.

# ఘనంగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రేగటి నాగరాజు జన్మదిన వేడుకలు

ఉరవకొండ, జూన్ 26 ప్రభాతవార్త


రేగటి నాగరాజు జన్మదిన వేడుకల దృశ్యం

తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రేగటి నాగరాజు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని ఆయన స్వగ్రామమైన రాయంపల్లిలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నడుమ ఆయన కేక్ కట్ చేశారు. పలువురు ఆయన్ను శాలువాకప్పి పూలమాలలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు యం.వర ప్రసాద్, మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు యం.రామాంజినేయులు, మీనుగ రవి, మాజీ వార్డు సభ్యుడు చింతా చంద్రమోహన్, శంకర సుదర్శన్, గోపాల్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# లక్ష్యం నిర్దేశించుకొని చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- ప్రతిభా పురస్కారాల ప్రధానంలో 1987-89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఉరవకొండ, జూన్ 26 ప్రభాతవార్త


ప్రోత్సాహక చెక్కులు అందుకున్న విద్యార్థులతో పూర్వ విద్యార్థులు, ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు

ప్రతి ఒక్క విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రుల తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఉరవకొండలోని కరిబసవస్వామి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1987-89 మధ్య కాలంలో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు సాకే భాస్కర్, బి.శశికళదేవి, కె.మాధవిలత, టి.వెంకట్, ఎన్.కృష్ణమూర్తి, జె.రామాంజనేయులు, ఆర్.విజయ్, ఎస్.విశ్వరూపచారి, జి.భీమలింగ పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్.మమత అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2022-24 విద్యా సంవత్సరంలో చదివి ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 835 మార్కులు సాధించిన ఎస్.మహమ్మద్ ఖలీద్, బైపీసీలో 887 మార్కులు సాధించిన సి.హరిక్రిష్ణ, బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీలో 900 మార్కులు సాధించిన ఎస్.రంజిత, బైపీసీలో 753 మార్కులు సాధించిన పి.హబీబా ఒక్కొక్కరికి 5,000 రూపాయల వంతున ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాలల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్.మమతను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

# కొత్త చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించిన డిఎస్పీ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్, జూన్ 26 ప్రభాతవార్త


సదస్సుకు హాజరైన పోలీసులు

దేశ వ్యాప్తంగా జులై 1వ తేది 2024 నుంచి అమలు గాబోవు కొత్తచట్టాల గురించి ధర్మవరం డివిజన్ పరిధి లోని కానిస్టేబుల్ స్థాయి నుంచి సిఐ స్థాయి వరకు పట్టణంలో శ్రీషిర్డి సాయిబాబా కళ్యాణ మండపంలో డిఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలోరాబోవు కొత్త చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. ఈ అవగాహన సదస్సులో 6 మంది శిక్షకులు క ఒత్త చట్టాలపై వివరాలను తెలియజేశారు. సాంకేతిక సాక్ష్యాధారణ, సేకరణ భద్రపరచు విధానం, సాంకేతిక వినియోగం గురించి వివరించడం జరిగిందని సాంకేతిక నిపుణుల చేత ప్రతి చట్టం యొక్క వివరణ అందరికీ తెలియజేయడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పుట్టపర్తి జిల్లా ఐటి కోర్ కి వారిచే అమలు కాబోతున్న కొత్త చట్టాలు, సిసిటిఎన్ఎస్ అప్లికేషన్‌లో వచ్చిన అప్‌డేట్ గూర్చి, ఈ సాధ్య యాప్ గురించి వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీతోపాటు సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నముష్టూరు గ్రామంలో డయేరియాతో వృద్ధుడు మృతి

ఉరవకొండ, జూన్ 26 ప్రభాతవార్త


డయేరియాతో మృతి చెందిన వృద్ధుడు కురుబ నాగేంద్ర మృతదేహం, కురుబ నాగేంద్ర (ఫైల్‌ఫోటో)

మండల పరిధి లోని చిన్నముష్టూరు గ్రామానికి చెందిన కురుబ నాగేంద్ర (75) అనే వృద్ధుడు డయేరియాతో మృతి చెందాడు. ఎంతో ఆరోగ్యంగా ఉండే నాగేంద్ర గత నాలుగైదు రోజులుగా వాంతులు విరేచనాలతో బాధపడుతున్నాడని బుధవారం అవి ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య సూరమ్మ 3 సంవత్సరాల క్రితం మృతి చెందగా వివాహితులైన ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడు నాగేంద్ర గొర్రెలను కాచేవాడని సమాచారం. ఇంటికి పెద్దదిక్కు వాంతులు, విరేచనాలతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. నాగేంద్ర మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా గ్రామంలో డయేరియాతో మరికొందరు బాధపడుతున్నట్లు తెలియవచ్చింది.

# పెద్దముష్టూరు గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

- దగ్గరుండి పర్యవేక్షించిన గ్రామ సర్పంచ్ నెట్టం సరస్వతి

ఉరవకొండ, జూన్ 26 ప్రభాతవార్త


మురికి ప్రదేశాల్లో దోమల నివారణకు మందు వేయిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని పెద్దముష్టూరు గ్రామంలో బుధవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగాయి. పంచాయతీ సర్పంచ్ నెట్టం సరస్వతి ఆధ్వర్యంలో కార్యదర్శి రమణకుమార్ పారిశుద్ధ్య గ్రామ ప్రత్యేక అధికారి అశ్వర్థనారాయణ (హౌసింగ్ ఏఈ) పర్యవేక్షణలో పారిశుద్ధ్య సిబ్బందితో మురుగు కాలువలను శుభ్రం చేయించి మురిగినీరు నిలబడినచోట దోమల వ్యాప్తి జరుగకుండా మందును పిచికారి చేయించారు. గ్రామంలోని ఓహెచ్‌ఎస్ఆర్‌ను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నెట్టం సరస్వతి మాట్లాడుతూ సీజినల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ ఆధ్వర్యంలో అన్ని చర్యలు తీసుకొంటున్నామన్నారు. ప్రజలు పరిసరాలతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ గ్రేడ్-5 కార్యదర్శి గౌతమి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# అధిక ఫీజులపై ఎస్ఎఫ్ఐ ధర్నా



ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా చేస్తున్న దృశ్యం

గుత్తి, జూన్ 26 ప్రభాతవార్త

ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల రూపంలో తల్లిదండ్రుల నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని నినదిస్తూ బుధవారం ఎంఇఓ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ మాట్లాడుతూ ఫీజుల రూపంలో, పుస్తకాల రూపంలో, ట్యూషన్ల పేరుతో తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అనుమతులు లేకుండా హాస్టళ్ల నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, బాలాజీ, వినయ్, ఈశ్వర్, గురునాథ్, తదితరులు పాల్గొన్నారు.

# గుత్తి మున్సిపాలిటీలో శానిటేషన్ డ్రైవ్


కాలువలను పరిశీలిస్తున్న దృశ్యం

గుత్తి, జూన్ 26 ప్రభాతవార్త

గుత్తి మున్సిపల్ పరిధిలో బుధవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా కమీషనర్ శ్రీనివాసులు మురుగుకాలువలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్మికులు మురుగుకాలువలను శుభ్రం చేయాలన్నారు. అనంతరం సచివాలయాలను తనిఖీ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఆదేశాలను తప్పకుండా అమలు చేయాలని ఆయన సూచించారు.

# సకాలంలో ఎఫ్‌పీ షాపులకు నిత్యవసరాల లిఫ్టింగ్ పూర్తి చేయాలి

- ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీలో ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి, డీయం రమేష్‌రెడ్డి

ఉరవకొండ, జూన్ 26 ప్రభాతవార్త


ఉరవకొండ ఎంఎల్ఎస్ పాయింట్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి

ఎంఎల్ఎస్ పాయింట్ పరిధి లోని మండలాల్లోగల ఎఫ్‌పీ షాపులకు సకాలంలో నిత్యవసరాల లిఫ్టింగ్ పూర్తి చేయాలని అవసరమైతే మరిన్ని లారీలను పెట్టుకోవాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా డిపో మేనేజర్ రమేష్ రెడ్డి సూచించారు. బుధవారం వారు వేరు వేరుగా ఉరవకొండలోని మార్కెట్ యార్డు గోదాముల్లో నిర్వహిస్తున్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసి స్టాక్ రిజిస్టార్, గోదాములో నిల్వలను పరిశీలించారు. జూలై 1వ తేదీ నుండి ఎఫ్‌పీ షాపుల్లో నిత్యవసరాల పంపిణీ జరుగాల్సి ఉందన్నారు. నిత్యవసరాలకు సరఫరా చేయడానికి వచ్చిన బియ్యం, జొన్నల నిల్వలను పరిశీలించి స్టాకిస్టు చంద్రమోహన్‌రావుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ తహశీల్దార్ దస్తగిరయ్య, డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్, ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నిల్వలను పరిశీలిస్తున్న పౌరసరఫరాలశాఖ డీయం రమేష్‌రెడ్డి

# ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన బిజెపి నాయకులు


ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

గుంతకల్లు, జూన్ 26 ప్రభాతవార్త

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని బిజెపి నాయకులు బుధవారం సందర్శించారు. ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ కొరత, అదనపు గదుల అసంపూర్తి, ప్రధానంగా వైద్యుల కొరత, రోగులకు సరైన వైద్యం అందడంలేదని పేర్కొన్నారు. ఈ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో పాటు ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళతామన్నారు. అనంతరం ఆయా విషయాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ జయవర్ధన్‌రెడ్డితో చర్చించారు. ఆసుపత్రిని సందర్శించిన వారిలో బిజెపి పట్టణాధ్యక్షులు వడ్డే రమేష్, సీనియర్ నాయకులు బండారు కృష్ణమూర్తి, నాయకులు సతీష్‌చౌదరి, విజయలక్ష్మి, జిఎం మహేష్, తదితరులు వున్నారు.

# నేటి నుండి జాతీయ ఉపాధి హామీ పథకంపై గ్రామసభలు

అమరాపురం, జూన్ 26 ప్రభాతవార్త


ఎంపిడిఓ మునిస్వామి

మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన జాతీయ ఉపాధి హామీ పథకం పనులు, సామాజిక భద్రత ఫించన్లు, కన్వర్షన్ పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో గ్రామసభలను గురువారం నుండి నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ మునిస్వామి తెలిపారు. 27న బసవనపల్లి, వలస, మద్దనకుంట, 28న తమ్మడేపల్లి, 29న హాలుకూరు. హేమావతి, శివరం, జూలై 1న అగ్రహారం, ఆలదపల్లి, అమరాపురం, నిద్రగట్ట గ్రామ పంచాయతీ కేంద్రాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా జూలై 5న సామాజిక తనిఖీ బృందం ద్వారా వచ్చిన నివేదికలపై ఎంపిడిఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# రజాపురం గురుకులంలో విద్యార్థినిలకు అస్వస్థత


అధికారులు సమీక్షిస్తున్న దృశ్యంన

గుత్తి, జూన్ 26 ప్రభాతవార్త

గుత్తి మండలంలోని రజాపురం గ్రామంలో వున్న అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో పదుల సంఖ్యలో విద్యార్థినిలు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు తెలియవచ్చింది. యాజమాన్యం ఈ విషయం బయటకు పొక్కకుండా వారికి ప్రాంగణంలోనే వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం బహిర్గతం కావడంతో అధికారులు కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి, డిసిఓ మురళీకృష్ణ, తహశీల్దార్ భారతి, ఎంపిడిఓ శ్రీనివాసులు, మెడికల్ అధికారి ప్రవీణ్, తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. పది మందికి విరేచనాలు, మరో పది మందికి వాంతులు అవుతున్నాయని వారి కోసం ప్రత్యేకంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశామని నీటి సరఫరాతో పాటు ఆహారం నాణ్యతలో ఎలాంటి లోటుపాట్లు లేవని అధికారులు తెలిపారు.

# పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

-ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, జూన్ 26 ప్రభాతవార్త

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయం వెనుక వున్న పాత తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్‌చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమీషనర్ వెంకటరమణయ్యతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బివిస్ కృష్ణారెడ్డి, పట్టణాధ్యక్షులు బండారు ఆనంద్, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీకి బిగ్ షాక్.. తేదేపా తీర్థం పుచ్చుకున్న ఐదు మంది వైసీపీ కౌన్సిలర్లు

- వైసీపీని సాగనంపడంతోనే రాష్ట్రాభివృద్ధి


ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో ఐదు మంది వైసీపీ కౌన్సిలర్లు తేదేపాలోకి చేరుతున్న దృశ్యం

మడకశిర టౌన్, జూన్ 26 ప్రభాతవార్త

మడకశిర నియోజకవర్గ ప్రజలు చిత్తు చిత్తుగా వైసీపీని ఓడించి రాష్ట్రాభివృద్ధి చేసే విధంగా వైసీపీ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ప్రస్తుత ఎమ్మెల్యే ఎంఎస్.రాజు అన్నారు. మున్సిపాలిటీకి చెందిన వైసీపీకి చెందిన ఐదు మంది కౌన్సిలర్లు తమ అనుచరులతో కలిసి బుధవారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే ఎంఎస్.రాజుల సమక్షంలో పార్టీని వీడి టిడిపిలోకి చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లెక్కలకు మించి అప్పులు తెచ్చిన జగన్‌రెడ్డి అభివృద్ధి పనులు చేపట్టకుండా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. సొంత ఖజానాను నింపుకుని ప్రజల నెత్తిన రుణభారాన్ని మోపారన్నారు. విద్యుత్, బస్సు చార్జీలు, పెట్రోల్ చార్జీలు, గ్యాస్, నిత్యావసరస ధరలను విపరీతంగా పెంచి అన్ని వర్గాల ప్రజలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేశారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్‌రెడ్డి ఆ పథకాలను రద్దు చేసి అర్హులకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మడకశిర నియోజకవర్గాన్ని అభివృద్ధి కోసం తనను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీలకు శిరస్సు వంచి నమస్కరించారు.

# విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించిన సెబ్ పోలీసులు


మానవ హారం ఏర్పాటు చేసిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి, జూన్ 26 ప్రభాతవార్త

అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మోడల్ స్కూల్ అలాగే కాలేజీ విద్యార్థులకు చెన్నేకొత్తపల్లి, సెబ్ పోలీసులు, మాదక ద్రవ్యాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు, గ్రామంలోని ప్రధాన రహదారి మీదుగా ర్యాలీగా వెళ్లి చె న్నేకొత్తపల్లి బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి మాదక ద్రవ్యాలపై వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సెబ్ పోలీసులు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యం ఎవరు అలవాటు పడవద్దని మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల కేంద్రనాడి వ్యవస్థపై పని చేసి శరీర అవయవాలతోపాటు మెదడుపై ప్రభావం చూపుతుందని, మావన శరీరం బాగాలు ఒక్కొక్కటిగా క్షీణిస్తాయని అన్నారు. అందువల్ల మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు సమాజంలో ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్ఎస్ గేట్ పిహెచ్‌సి వైద్యాధికారి ఉదయ్‌పై నిజ నిర్ధారణ కమిటీ

చెన్నేకొత్తపల్లి, జూన్ 26 ప్రభాతవార్త


మీడియాతో మాట్లాడుతున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి మండలం ఎన్ఎస్ గేట్ పిహెచ్‌సి డాక్టర్ ఉదయ్‌పై ఓ కమిటీని డిఎం అండ్ హెచ్‌ఓ నలుగురు సభ్యులతో కూడిన నిజ నిర్ధారణ కమిటీని బుధవారం వేయడం,జరిగింది. కమిటీ బృందం డాక్టర్ నివేదిత, అనురాధ, వీరమ్మ, రామలక్ష్మమ్మలతో కూడిన కమిటీ సభ్యుల బృందం బుధవారం వచ్చి ఆసుపత్రుల్లో ఏఎస్‌ఎంలతోనూ సిబ్బందితో వివరించారు. వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ చేస్తున్న లైంగిక వేదింపులపై ఏఎన్ఎంలు పలు ఫిర్యాదులు చేశారు. ఏఎన్ఎంలకు డా.ఉదయ్ చేసిన వాట్సాప్ మెసేజ్‌లను వారు కమిటీబృందంకి చూపెట్టడంజరిగింది. ఈ విషయాలన్నింటిని, కూలంకుశంగా పరిశీలించి తాము సంబంధిత ఉన్నతాధికారులకు నివేదికపంపడం జరుగుతుందనిఅన్నారు. వీరివిచారణపట్ల ఏఎన్ఎంలుసిబ్బంది పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ ఉదయ్‌పై చర్యలుతీసుకోకపోతే తీము సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లామని ఏఎన్ఎంలు సిబ్బంది అన్నారు. ఈ సందర్భంగా, ఉద్యోగులు, సంగం జిల్లాఅధ్యక్షులు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ విచారణలో డాక్టర్‌ఉదయ్ రాకపోవడంతో, డాక్టర్ విచారించకుండా ఏఎన్ఎంలు మాత్రమే విచారించడం ఎంతవరకు న్యాయమని అన్నారు. డాక్టర్‌పై చర్యలు తీసుకోకపోతే తాము ఎంతవరకైనా పోరాడుతామని, యూనియర్ నాయకులు హెచ్చరించారు. కమిటీ బృందం సభ్యులు మాట్లాడుతూ.. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నిష్పక్షపాతంగా నివేదిక అందిస్తామని డాక్టర్ ఉదయ్ విచారణకు రానందున అతనిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుని పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం మండల, తాలూకా అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, అలాగే సిపిఎం నాయకులు లింగన్న, దండోరా నాయకులు, దబ్బల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక వార్త



## చెన్నపట్టణ ఎంఎల్ఏను ఎన్నుకోవాల్సిన సమయం వచ్చింది - డికె.శివకుమార్



చెన్నపట్టణలో జనతాదర్శన్ సభలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్.

**చెన్నపట్టణ (రామనగరజిల్లా ),జూన్26,ప్రభాతవార్త ప్రతినిధి**

చెన్నపట్టణ విధానసభ ఎన్నికల్లో ఈసారి ఓటర్లు సమర్థమంతుడైన పనిచేసే అభ్యర్థిని ఎన్నుకునే సమయం ఆసన్నమైందని ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ చెప్పారు.ఆయన బుధవారం చెన్నపట్టణ తాలూకాలోని బేవూరు, తిట్టేమారనహళ్లి ప్రాంతాల్లో జరిపిన జనతాదర్శన్ సభల్లో పాల్గొని ప్రజల నుంచి మనవి పత్రాలు స్వీకరించి స్థలంలోనే పరిష్కరించి మీడియాతో మాట్లాడారు.ఈసారి ఇక్కడ నుంచి నేను పోటీ చేయాలని అనుకుంటున్నాను. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తాను.ఇక్కడి ప్రజలు అభివృద్దిని కోరుకుంటున్నారు.రాజధాని బెంగళూరు నగరంలో భాగంగా బెంగళూరు గ్రామీణజిల్లాగా ఈప్రాంతం గతంలో మాదిరిగా కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారు.వారి ఆశలను తీర్చే సమయం ఆసన్నమైంది.ఇక్కడ నుంచి నేను పోటీచేసి గెలిస్తే ఈ ప్రాంతం కూడా కనకపుర మాదిరిగా అభివృద్ధి చేస్తామన్నారు.జనతాదర్శన్‌లో అనేకమంది మహిళలు తమ వినతి పత్రాలను ఉపముఖ్యమంత్రికి అందచేశారు.

## మధ్య కర్ణాటక ప్రాంతం నుంచి ఉపముఖ్యమంత్రిని నియమించాలి

### - కాంగ్రెస్ అధిష్టానానికి లింగాయత సముదాయం మనవి

**బెంగళూరు,జూన్26,ప్రభాతవార్త ప్రతినిధి**

సిద్ధరామయ్య సర్కారులో లింగాయత సముదాయానికి ఒక ఉపముఖ్యమంత్రి స్థానం కేటాయించాలని కోరేందుకు ధార్వాడ జిల్లా ఎంఎల్ఏ మాజీ మంత్రి వినయ్‌కులకర్ణి నాయకత్వంలో 15మంది లింగాయత నాయకుల బృందం ఢీల్లీకు బయలుదేరి వెళ్లింది.ఈమేరకు పార్టీ వర్గాలు బుధవారం తెలిపాయి.మధ్య కర్ణాటక ఏరియాలోని దావణగెరె ఎంపీ సీటులో కాంగ్రెస్ గెలుపొందటం మరియు బెళగావి జిల్లా చిక్కోడి లోక్‌సభ సీటు గెలుచుకోవటంతో ఈ ప్రాంతానికి లింగాయత సముదాయం ఇచ్చిన మద్దతుకు బదులుగా ఒక డిసిఎంను కేటాయించాలని పార్టీ అధిష్టానానికి మనవి చేశారు.ఇవాళ ఢిల్లీలో ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పార్టీ అధిష్టానం నాయకులను కలుసుకుంటారు. కర్ణాటకలో లింగాయత సముదాయం నుంచి మైనారిటి సముదాయం నుంచి దళిత సముదాయం నుంచి ఒక్కొక్కరిని డిసిఎంలుగా నియమించాలన్న డిమాండ్ కాంగ్రెస్‌పార్టీలో జోరుగా వినబడుతోంది.కాగా ధార్వాఢ జిల్లా ఇంఛార్జ్ మంత్రిగా ఉన్న భైరతీ సురేష్ ధార్వాఢ జిల్లాలో సూపర్ ముఖ్యమంత్రిగా అధికారం చెలాయిస్తూ తమకు అందుబాటులో లేకుండా పోతున్నారని వినయ్‌కులకర్ణి ప్రతినిధుల బృందం ఆరోపించింది.

## యువకుడి హత్యకేసులో జైలుపాలైన దర్శన్ నుంచిరివాల్వర్ రికవరికి పోలీసు కమిషనర్ ఆదేశాలు

**బెంగళూరు,జూన్26,ప్రభాతవార్త ప్రతినిధి**

యువకుడి హత్యకేసులో జైలు పాలైన సినీహీరో దర్శన్ అతడి అనుచరుడు ప్రదోష్‌ల నుంచి వెంటనే రివాల్వర్లను రికవరి చేయాల్సిందిగా బెంగళూరు పోలీసుకమిషనర్ దయానంద్ బుధవారం పోలీసులను ఆదేశించారు.రేణుకాస్వామి హత్యకేసు రోజుకో లెక్కన ట్విస్టు జరుగుతుంతడంతో పరప్పనఅగ్రహార సెంట్రల్‌జైల్లో ఉన్న అనుచర నిందితులకు ప్రాణభయం ముప్పు ఉందని అనుమానించిన నగరపోలీసులు దర్శన్ వద్ద ఉన్న వెపన్ గురించి ఆరాతీశారు.ఈయనకు ప్రదోష్‌కు ఇటీవల లోక్‌సభ ఎన్నికల ముందు పోలీసుశాఖ ఆయుధాలనుంచి రియాయితి ఇచ్చింది.అయితే మారిన పరిస్థితుల్లో దర్శన్ హత్యకేసులో ఇరుక్కుపోవటంతో అతడి వద్ద ఉన్న రివాల్వర్‌ను వెంటనే రికవరి చేయాలని నగరపోలీసువిభాగం ఆదేశాలు జారీ చేసింది.

## బెంగళూరులో సినిమాస్టయిల్లో బంగారదుకాణంపై దుండగుల దాడి

### - 60లక్షల రూపాయల నగలు దోచుకుని పరారీ

**బెంగళూరు,జూన్26,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరు నగరం పశ్చిమభాగంలోని మాదనాయకనహళ్లి సమీపంలోని లక్ష్మీపురలో మంగళవారం రాత్రి ఇద్దరు దుండగులు ముసుగులు ధరించి ఒక బంగారు అంగట్లోకి జొరబడి తుపాకులతో అంగడి సిబ్బందిని బెదిరించి నిమిషం సమయంలో 60లక్షల రూపాయల విలువైన బంగారు నగలు దోచుకుని పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లక్ష్మిదేవి నగర్‌లోని పదమ్ జ్యూయలరీ అంగట్లో రాత్రి 10.00గంటల సమయంలో మోటార్‌బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు షాపులోని సిబ్బందికి రివాల్వర్‌తో బెదిరించి అంగడి షోకేస్‌లో ఉన్న నగల పెట్టెలను గోనెసంచిలో నింపుకుని నిమిషం వ్యవధిలో మోటార్‌బైక్‌పై ఉడాయించారు. అచ్చు సినిమాఫక్కీలో జరిగిన ఈ దోపిడికి బంగారు నగల దుకాణదారుడు సిబ్బంది నిర్ఘాంతపోయారు.తమ కళ్లముందే నగలను దోచుకుంటున్న దుండగులను ఏమీ చేయలేని పరిస్థితిలో వారు ఉండిపోయారు. అంగడి సిబ్బంది తేరుకునేలోపు దుండగులు ఇద్దరు మోటార్‌సైకిల్‌పై చీకట్లో పరారయ్యారు.దోడిడి జరిగిన ప్రాంతానికి పోలీసు ఉన్నతాధికారులు హాజరై పరిశీలించారు.దుండగులు 750గ్రాముల బరువున్న వివిధ రకాల బంగారు నగలను పెట్టెలతో సహా దోచుకున్నారు.

## బాగలకోట జిల్లాలో విద్యుత్ తీగలు తెగిపడి అగ్నిప్రమాదం ఇద్దరు వ్యక్తులు మృతి

**బాగలకోట,జూన్26,ప్రభాతవార్త ప్రతినిధి**

బాగలకోట జిల్లా తేరదాళ పట్టణంలోని దాసరమడ్డి ప్రాంతంలో బుదవారం వేకువజామున ఒక రేకులషెడ్డు అంగడిపైన విద్యుత్ తీగలు తెగిపడిపోవటంతో షెడ్డులో మంటలు లేచి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు దాసరమడ్డి ఏరియాలోని రేకులషెడ్డులో నిద్రిస్తున్న యువకులు సంతోష్ సుణగార అనే యువకుడు శోభా హుల్లణ్ణనవర అనే యువతి ప్రమాదంలో మృతి చెందింది.ఈ ప్రమాదంలో మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.తెగిపడిన విద్యుత్తు తీగల్లో కరెంటు ప్రవహించి విద్యుదాఘాతం జరిగింది.పోలీసులు స్థలానికి హాజరై పరహారచర్యలు చేపట్టారు.బాగలకోట జిల్లాలో రెండురోజులుగా జోరు వర్షాలు కురుస్తున్నాయి.

## లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ ఎన్నిక - సిఎం అభినందనలు



లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నికైన రాహుల్‌ను అభినందిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

**బెంగళూరు,జూన్26,ప్రభాతవార్త ప్రతినిధి**

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిగా కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.రాహుల్‌గాంధీని ప్రతిపక్ష నాయకుడిగా ఎంపిక చేయాలంటూ తాను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ప్రతిపాదన పెట్టానని కర్ణాటక సిఎం సిద్దరామయ్య చెప్పారు.లోక్‌సభ ప్రతిపక్ష నేతగా ఎన్నికైన ఇండియా కూటమి నాయకుడు రాహుల్‌గాంధీని ఆయన అభినందించారు.అంతకుముందు ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సభలో ఏఐసిసి ప్రధానకార్యదర్శి కెసి.వేణుగోపాల్ రాహుల్ పేరును ప్రతిపక్ష నేతగా ప్రతిపాదించగా అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు.ప్రతిపక్ష నాయకుడి ఎన్నికైన రాహుల్‌ను ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభినందించారు. కాగా సిఎం మాట్లాడుతూ రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఈసారి 17వ లోక్‌సభలో పేదల సమస్యలను ఎలుగెత్తి మాట్లాడి న్యాయం సమకూర్చుతారని చెప్పారు.ప్రధాని మోదీకి రాహుల్ సింహస్వప్నంగా తయారవుతారని ఆశాభావం వెలిబుచ్చారు.దేశంలోని సమకాలీన సమస్యలకు ఈసారి పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు తగిన న్యాయం చేసి సర్కారు మెడలు వంచుతారని చెప్పారు.

## యాదగిరి జిల్లాసుపత్రిలో తాగునీటికి కటకట

**యాదగిరి,జూన్26,ప్రభాతవార్త ప్రతినిధి**

జిల్లా కేంద్రం యాదగిరిలోని జిల్లా ఆసుపత్రిలో తాగునీటి సమస్య రావటంతో రోగులు బయట ప్రాంతాల నుంచి నీళ్లు తెచ్చుకుని ఉపయోగించుకుంటున్నారు.ఇక్కడి జిల్లాసుపత్రిలో తాగునీటిని శుద్దీ చేసే రెండు యంత్రాలు పాడైపోవటంతో రోగులు నీళ్లకోసం పదేపదే బయటకు వెళ్లాల్సి వస్తోంది.యాదగిరి జిల్లా ఇంఛార్జీ మంత్రి శరణబసప్పదర్శనాపూర్‌కు రోగులు మనవి చేసినా కూడా అటు ఆసుపత్రివర్గాలు ఇటు అధికారులు స్పందించలేదు.ఇక్కడి జిల్లాసుపత్రికి బయట ప్రాంతాల నుంచి నిత్యం వందలాది రోగులు వస్తున్నారు.వారికి ఆసుపత్రిలో తాగునీరు అందుబాటులో లేకపోవటంతో ఆసుపత్రి వైద్యులపై శాపనార్థాలు పెడుతున్నారు.యాదగిరి జిల్లాసుపత్రిలో జరుగుతున్న అవ్యవస్థ గురించి ఇప్పటికైనా ఆరోగ్యశాఖ అధికారులు కళ్లు తెరిచి వెంటనే అక్కడి సమస్యలను పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు.

## మంగళూరులో జోరు వానలకు ఇంటిగోడ కూలి నలుగురు మృతి



మంగళూరు జిల్లా ఉళ్లాల తాలూకాలో గోడకూలి నలుగురు మృతి .మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

**మంగళూరు,జూన్26,ప్రభాతవార్త ప్రతినిధి**

మంగళూరు నగరం బయట ఉన్న ఉళ్లాల తాలూకా కొత్తారుమదని గ్రామంలో బుధవారం వేకువజామున కురిసిన భారీ వర్షాలకు అబూబక్కర్ అనే వ్యక్తికి చెందిన ఇంటిగోడ కూలి పక్కన ఉన్న యాసిర్ ఇంటిపై పడిపోవటంతో సదరు పెంకుల ఇంట్లో నిద్రిస్తున్న యాసిర్(45)మరియమ్మ(40,వారి పిల్లలు రియాన రిహాన నిద్రలోనే మృతి చెందారు.అర్ధరాత్రి తరువాత వానల జోరుకు అబూబక్కర ఇంటిగోడ కూలటం ఆపక్కనే ఉన్న పెద్ద కొబ్బరిచెట్లు రెండు యాసిర్ పెంకుటిల్లుపై పడిపోవటంతో ప్రమాదం సంభవించింది.జోరువానలో జరిగిన ఈ ప్రమాదం గురించి ఇరుగుపొరుగు ప్రజలు వెంటనే తేరుకుని వానలు తగ్గిన తరువాత ఇంటి శిధిలాల కింద చిక్కుకుని పోయిన నలుగురు మృత దేహాలను బయటకు తెచ్చేందుకు ప్రయత్నించారు.ఆలోగా ఉళ్లాల పోలీసులు రెస్క్యూ టీంను పంపి ఇంటి శిధిలాల కింద చిక్కుకున్న ముగ్గురి మృత దేహాలను బయటకు తెచ్చారు.మరో బాలిక మృత దేహం కోసం శిధిలాలను తొలగిస్తున్నారు.ప్రమాదం జరిగిన స్థలానికి మంగళూరు జిల్లా కలెక్టర్ ఎం.ముగిలన్ హాజరై పరిహార పనులను పర్యవేక్షించారు.

## కెఆర్ఎస్ నుంచి నీరు విడుదల చేయాలి - మండ్యలో రైతుల ధర్నా

**మండ్య,జూన్26,ప్రభాతవార్త ప్రతినిధి**

మండ్య జిల్లాలోని కృష్ణరాజసాగర ( కెఆర్ఎస్) డ్యాం నుంచి పంటల సాగుకోసం వెంటనే నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు.మండ్య పట్టణంలో బుధవారం కర్ణాటక రాజ్య రైత సంఘం నాయకులు ఈమేరకు ప్రభుత్వానికి మనవి చేశారు.ఈసారి ఇంకా కావేరి పరివాహక ప్రాంతంలో వానలు కురవటం జాప్యం కావటంతో రైతులు తమ పొలాలను పంటల సాగుకు సిద్దం చేసుకునేందుకు మద్దూరు తాలూకా కాలవ చివర భూముల వరకు ఒక్కసారి నీరు విడుదల చేయాలని కోరారు.ఈ జిల్లాలో ఈ సీజనులో ఇంతవరకు రైతులు తమ పొలాలను ఇంకా పంటల సాగుకోసం సిద్దం చేయలేదని రైతు నాయకుడు నాగరాజు చెప్పారు.సర్కారు ఒకసారి కెఆర్ఎస్ నుంచి నీటిని విడుదల చేస్తే రైతులు పంట పొలాలను పంటల సాగుకోసం సిద్దం చేసుకుంటారని తెలియజేశారు.మండ్య జిల్లా ఇంఛార్జ్ మంత్రి వ్యవసాయశాఖ మంత్రి ఎన్.చెలువరాయస్వామి వెంటనే కావేరి నీరావరి నిగమ అధికారులను ఆదేశించి మండ్యలో విసి కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలని కోరారు.

## దర్శన్ గ్యాంగ్‌లోని నలుగురు దుండగులను తుమకూరు జైలుకి తరలించిన పోలీసులు

**తుమకూరు,జూన్26,ప్రభాతవార్త ప్రతినిధి**

చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి అనే యువకుడి హత్యకేసులో బెంగళూరు సెంట్రల్‌జైల్లో రిమాండ్‌లో ఉన్న సినీహీరో దర్శన్ అతడి 20 మంది అనుచరుల్లో ప్రధానమైన నలుగురు దుండగులను పోలీసులు బుధవారం పరప్పనఅగ్రహార జైలునుంచి తుమకూరుకు తరలించారు.రేణుకాస్వామి హత్యకేసులో ప్రధానపాత్ర వహించి కిడ్నాప్ హత్య,మృత దేహం తరలింపులో ఈ నలుగురు కీలకంగా ఉన్నారని సిఐడి పోలీసులు ఆధారాలతో సమేతంగా సాక్ష్యాలు సేకరించారు. నిందితులను దర్శన్ గ్యాంగ్ నుంచి రక్షించటం కోసం నిఖిల్‌నాయక్,కేశవమూర్తి,కార్తిక్,నాగరాజులను పోలీసు ఎస్కార్టుతో తుమకూరు జిల్లా జైలుకి తరలించారు.సాక్ష్యాలను నాశనం చేస్తారనే అనుమానంతో బెంగళూరు జైలునుంచి దర్శన్ అనుచరులను వేరేజైలుకి తరలించారు.

## మైసూరు కాంగ్రెస్ ఎంఎల్ఏ పై హనీట్రాప్

### - ఇద్దరు దుండగుల ఆరెస్టు

**మైసూరు,జూన్26,ప్రభాతవార్త ప్రతినిధి**

మైసూరులోని చామరాజ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ ఎంఎల్ఏ హరీష్‌గౌడ హనీట్రాప్‌లో చిక్కుకుని పోయారు.మైసూరుకు చెందిన కొందరు దుండగులు హరీష్‌కు ఒక యువతిని పరిచయం చేసి ఒక ఏకాంత స్థలంలో సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.యువతి పలుసార్లు ఎంఎల్ఏకు ఫోను చేసి భూమి విషయంలో చర్చించేందుకు ఫలానా ప్రాంతానికి రావాల్సిందిగా ఆహ్వానించటంతో హరీష్ అక్కడకు వెళ్లారు.ఆ ఏరియాలో రహస్య కెమేరాలను అమర్చిన దుండగులు హరీష్ యువతితో ఉండటం పట్ల విడియో చిత్రీకరించి పెద్ద మొత్తంలో నగదుకు డిమాండ్ చేశారు.దీంతో సదరు ఎంఎల్ఏ తాను హనీట్రాప్‌లో పడ్డానని గ్రహించి వెంటనే మైసూరు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో రంగంలోనికి దిగిన సిసిబి పోలీసులు సంతోష్ ,పుట్టరాజు అనే దుండగులను అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.కాంగ్రెస్ ఎంఎల్ఏ పై హనీట్రాప్ జరిపినట్లు దుండగులు అంగీకరించారు.

## కర్ణాటక కోస్తా మధ్య కర్ణాటక జిల్లాల్లో 29వరకు భారీ వర్షాలు - సిఎస్.పాటిల్

**బెంగళూరు,జూన్26,ప్రభాతవార్త ప్రతినిధి**

కర్ణాటక కోస్తా జిల్లాల్లో వచ్చే మూడురోజులు భారీఎత్తున వానలు కురుస్తాయని రాష్ట్ర వాతావరణ శాఖ ప్రధాన అధికారి సిఎస్.పాటిల్ బుధవారం చెప్పారు.దక్షిణకన్నడ,ఉడుపి,ఉత్తర కన్నడ,శివమొగ్గ, చిక్కమగళూరు, హాసన్, జిల్లాల్లో జోరు వర్షాలు కురుస్తాయని చెప్పారు.జాలర్లు సముద్రంలో చేపలవేటకు వెళ్లకూడదని కోరారు.ఉత్తర దక్షిణ కర్ణాటక జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కానుందని చెప్పారు.బెళగావి చామరాజనగర జిల్లాల్లోను గట్టి వానలు కురుస్తాయి.

## వేరుశనగ పొలాలను సందర్శించిన ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

**గోరంట్ల జూన్ 26 ప్రభాతవార్త**



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు.

మండల పరిధిలోని సింగిరెడ్డిపల్లి గ్రామ పోల్లాల్లో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం జాన్సన్ కోఆర్డినేటర్ మరియు కు రామసుబ్బయ్య మండల విలేజ్ అసిస్టెంట్ తో కలిసి వేరుశనగ పొలాలను సందర్శించారు.ఈ సందర్బంగా శాస్త్రవేత్తలు వేరుశనగ పంటపై వచ్చే చెడు పురుగుల నివారణోపాయాలు వాడవలసిన పిచికారి సంహారక మందులు గూర్చి వివరంగా తెలియజేశారు.ఈ సందర్బంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వేరుశనగ ప్రస్తుతం ఇతై దశ నుండి ఊడ దిగే దశ వరకు ఉన్నదని వేరుశనగ పంటకు శనగ పచ్చ పురుగు ఆశించడం జరిగిందని దీని నివారణకు కెనాల్ పాస్ రెండు మీల్లిలీటర్ల నీటిలో కలిసి పిచికారి చేయాలని వేరుశనగలు మొక్కలు అక్కడక్కడ చనిపొవుచున్నాయని వీటి నివారణ ఎక్స్ కొనజల్ రెండు మిల్లి లీటర్లు నిటి కలిపి పిచికారి చేయాలని మొక్కజొన్నలోనే ఎరువులు యాజమాన్యం చేయాలని ఇతైముందు 50 కిలోల యూరియా 150 కిలొాల సింగల్ సూపర్‌పాస్ట్ మరియు 25 కిలొాల పోటాష్ ఎరువులు వేసి విత్తనము పెట్టలేనని కత్తెర పురుగు రాకుండా పొలము చుట్టూ నాలుగు సార్లు జొన్నగాని సజ్జగాని వేసుకొన్నట్లయితే కత్తెర పురుగు ప్రధాన పొలంలో తక్కువగా ఆశిస్తుందని కత్తెరపురుగు నివారణకు ఇమామెట్టిన్ బెంజెట్ 80 గ్రాములు ఎకరానికి వాడాలని శాస్త్రవేత్తలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలతో పాటు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పొలం రైతులు పాల్గొన్నారు.

## అధికార దాహానికి రాజ్యాంగాన్నే బలిచ్చిన ఇందిరా గాంధీ

### - ఎమర్జెన్సీ పరిస్థితిపై మాజీ మంత్రి సురేష్‌కుమార్

**బళ్లారి, జూన్26, ప్రభాతవార్త;**



సామాజిక న్యాయానికై నాగరికులు అనే అంశంపై ఎమర్జెన్సీ పరిస్థితి రోజుల గురించి ప్రసంగిస్తున్న మాజీ మంత్రి, సీనియర్ బీజేపీ నాయకుడు సురేష్‌కుమార్

ఈ దేశంలో ప్రధానిగా అధికార దాహానికై రాజ్యాంగాన్నే బలిచ్చిన ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ పరిస్థితిలో పోలీసులు ఇచ్చిన శిక్ష నరకన దృశ్యమని మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు న ు రేష్ కు మ ా ర్ చెప్పారు. నగరంలోని బాలభారతి పాఠశాలలో ఎమర్జెన్సీ పరిస్థితి గురించి మాట్లాడారు. ఎమర్జెన్సీ విధించిన సమయంలో 14 నెలలపాటు తాను జైలు జీవితం గడిపినట్లు, ఆ అనుభవాలను ఒక్కొక్కటిగా తన ప్రసంగంలో విప్పి చెప్పిన ఆయన, 1974లో గుజరాత్‌లోని సూరత్‌లోని ఓ హాస్టల్‌లో వంట రుచిగా లేదన్న విషయంపై జరిగిన ఘటన ఇప్పటికీ తనకు గుర్తుండిపోయిందని, ఆ సమయంలో చిమన్‌భాయ్ పటేల్ సీఎంగా ఉన్నారని, ఈ ఘటన కారణంగా ఆయన పదవినే కోల్పోవాల్సి వచ్చిందని చెప్పారు. అనంతరం బీహార్‌లో విద్యార్థుల పోరాటం నుంచి ఆ రాష్ట్ర సీఎం కూడా అధికారం కోల్పోయారన్నారు. ఇదంతా జేపీ ఉద్యమం కారణంగానే జరిగిందని చెప్పుకొచ్చారు. 1975 జూన్ 12న అలహాబాద్ కోర్టు జేఎన్ సింహా లోక్‌సభ ఎన్నికల్లో అవినీతి జరిగిందని, ఎవరూ ప్రధాని కాకూడదని ఆరు సంవత్సరాలపాటు ఎన్నికలు జరగకూడదని చెప్పడం, అనంతరం గుజరాత్‌లో జనసంఘ్ అధికారంలోకి రావడం, ఎమర్జెన్సీ పరిస్థితి తీసుకురావడానికి ఇందిరాగాంధీ తాను చెప్పినట్లుగా నడుచుకునే వ్యక్తుల మాట విని ముందుకొచ్చారన్నారు. సుప్రీంకోర్టు ఇందిరాగాంధీ ప్రధాని అయ్యేందుకు అనుమతిచ్చింది. దీనివల్లే మొదట ఎమర్జెన్సీ పరిస్థితి ప్రకటించి అనంతరం రాష్ట్రపతిచే ప్రకటన చేయించారని, కా ంగ్రెస్, ఇందిరాగాంధీలు రాష్ట్రపతి భవనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని చెప్పారు. తాను బెంగళూరు యూనివర్సిటీలో లా కోర్సు చేసినా తనకు నిజమైన విద్యాభ్యాసం లభించింది ఎమర్జెన్సీ పరిస్థితిలో జైలు జీవితం నుంచి అని, కారణం అప్పటికే జైలులో ఉన్న అనేక మంది, ప్రముఖ మేధావుల చెంత ఉండడమేనని చెప్పారు. ఈ సందర్భంలో బీజేపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, వివిధ సంఘసంస్థలకు చెందిన పదాధికారులు, దళిత సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## ఏఐడీవైఓచే చెట్లు నాటే కార్యక్రమం

**బళ్లారి, జూన్26, ప్రభాతవార్త;**



చెట్లు నాటుతున్నప్పటి దృశ్యం

నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏఐడీవైఓ యువజనుల సంఘం ఆధ్వర్యంలో 59వ సంస్థాపన దినోత్సవం సందర్భంగా చెట్లు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ పండితారాధ్య, అధ్యాపకులు రిజ్వాన్‌ఖాన్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు చెట్లు నాటడం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తూ వారి భవిష్యత్‌కు పునాదులు వేస్తున్న ఏఐడీవైఓ సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ప్రిన్సిపాల్ పండితారాధ్య చెప్పారు. దేశవ్యాప్తంగా విస్తరించిన శాఖలతో ఏఐడీవైఓ సంఘం మహాపురుషుల ఆదర్శ జీవనాన్ని విద్యార్థుల్లో, యువకుల్లో ప్రచారం చేస్తూ వాటిని జీవనంలో అలవర్చుకునే నేపథ్యంలో యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐడీవైఓ జిల్లాధ్యక్షుడు ఎ.పంపాపతి, జిల్లా కార్యదర్శి జగదీష్ నేమకల్, లెక్చరర్లు బిరాధర్, జయన్న, గోవిందప్ప, వెంకటేష్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారులకు భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం

### - జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

**శ్రీసత్యసాయి జిల్లా జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి.**



అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్

జాతీయరహదారులకు భూములు కోల్పోయి అవార్డు పొందిన ప్రతిరైతుకు నష్టపరిహారం అందజేయడానికి కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లో భూ సేకరణ రైల్వే పనులపై భూ సేకరణ రైతులకు పరిహారం లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిచారు.ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ నేషనల్ హైవే అధికారి గిడ్డయ్య,ఆర్డీఓలు వెంకట శివసాయి రెడ్డి,భాగ్యరేఖ ఏపిఐఐసి అధికారి సహిపసోని సంబంధిత తహసిల్దార్‌లు పాల్గొన్నారు.ఈ సందర్బంగా జెసి మాట్లాడుతూ జాతీయ రహదారుల విస్తరణ కొరకు బి కొత్తపల్లి గోరంట్లలో భూ సేకరణ జరిగిందని నష్టపరిహారం చెల్లింపుల కోసం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో 11.04 కోట్ల పరిహారం పంపిణీకి సిద్దంగా ఉండాలన్నారు.ముదిగుబ్బ,నుండి పుట్టపర్తి నాలుగు లైన్ల విస్తరణ పుట్టపర్తి నుండి కొడూరు వరకు భూములు నష్టపోయిన నిర్వాసితులకు పరిహారం అందించడం జరుగుతుందని జెసి పేర్కొన్నారు.బుక్కపట్నం, పుట్టపర్తి,గోరంట్ల,మండలాల్లో అలాగే పెనుకొండ డివిజన్ లో చిలమత్తురు మండలాల్లోని రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు.ప్రతివారం పరిహారం పంపిణీ పై ప్రత్యేక సమీక్ష జరుగుదుందన్నారు.కోర్టుల లో ఉన్న కేసులకు కౌంటర్ వేయాలన్నారు.ఆయా మండలాల పరిధోలోని అధికారులు పరిహారం పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పుట్టపర్తి,కొత్తచెరువు,నల్లమాడ, బుక్కపట్నం,చిలమత్తురు,ఓడిసి,అమడగూరు,కదిరి మండలాల తహసిల్ధార్‌లు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

**పుట్టపర్తి రూరల్ జూన్ 26 ప్రభాతవార్త**

పుట్టపర్తి మండల పరిధిలోని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శ్రీసత్యసాయి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి మంజులవాణి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు.జిల్ల ఆరోగ్య శ్రీ అధికారి డాక్టర్ శ్రీదేవితో కలిసి ఆమె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పుట్టపర్తి లో జరుగు ఆరోగ్యశ్రీ సమావేశంలో పాల్గొన్నారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను ఆసుపత్రి పనితీరును వ్యాధి నిరోధక టీకాలు అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ గురించి విచారించి,వ్యాక్సిన్ నిల్ల ఉంచు ఫ్రిడ్జిలను ల్యాబ్ కాన్పుల గది వార్డులను పరిశీలించారు.రోగులకు అందించు వైద్య సేవల గురించి విచారించి సంతృప్తి వ్యక్తం చేశారు.జులై మాసములో జరుగు 0 డయేరియా కార్యక్రమాన్ని కుష్టువ్యాధి,సర్వే ప్రజలకు అడల్ట్ బిసిజి పై కలిగించు అవగాహన వ్యాక్సిన్ వేసుకొవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్యధికారి డాక్టర్ శ్రీకాంత్,సామాజిక ఆరోగ్య అధికారి నగేష్‌తో పాటు ఆసుపత్రి సిబ్బంది.పాల్గొన్నారు.

## పదిరోజుల నుండి నీళ్లు రాకుంటే ఎలా ? రెండో వార్డు ప్రజలు పెద్ద ఎత్తున ధర్నా

**పుట్టపర్తి రూరల్ జూన్ 26 ప్రభాతవార్త**

పట్టణంలోని రెండవ వార్డులో గత పది రోజుల నుండి ట్యాంకుల నుండి నీరు రావడంలేదని తాము ఎలా జీవించాలంటూ మున్సిపల్ కార్యలయం ముందు ధర్నా చేపట్టారు.బుధవారం ఆ వార్డులోని మహిళలు ప్రజలు ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతూ ధర్నా చేపట్టారు.మున్సిపల్ చైర్మెన్ రావాలి కమీషనర్ వచ్చి సమాధానం ఇవ్వాలి అంతవరకు కదలమని హెచ్చరించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గత పది రోజులుగా మోటర్లు చెడిపొయినందున నీరు కుళాయిలలో రావడం లేదన్నారు.పలుమార్లు మున్సిపల్ చైర్మెన్‌కు అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేకపోయిందన్నారు.రెండ వార్డుకు చెందిన చైర్మెన్ వార్డులోనే నీరు రాకపోతే ఇక ఎవరికి చెప్పుకోవాలన్నారు.వెంటనే మోటర్ మరమత్తులు చేయించాలని నినాదాలు చేశారు.స్పందించిన కమీషనర్ అంజయ్య వెంటనే మరమత్తులు చేయిస్తామని తమ సిబ్బందితో ఆ వార్డుకు బయలుదేరడంతో ప్రజలు ఆందోళన విరమించారు.ఈ కార్యక్రమంలో మాజి మున్సిపల్ చైర్మెన్ పిసి గంగన్న,నారాయణప్ప,పలువురు మహిళలు పాల్గొన్నారు.

## ప్రమాదాల నియంత్రణకు స్పీడ్ లేజర్ రాడార్ గన్ వినియోగం

### - జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు

**బళ్లారి, జూన్26, ప్రభాతవార్త;**

జిల్లా పోలీసుశాఖకు ప్రమాదాలను నియంత్రించేందుకు స్పీడ్ లేజర్ రాడార్ గన్‌తో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ వాహనదారుల్ని పసిగట్టేందుకు బ్రీత్ అనలైజర్ పరికరాలతో పాటు 112 వాహనాలు వినియోగంలోకి తీసుకొచ్చినట్లు జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు తెలిపారు. ఎస్పీ కార్యాలయం ఆవరణలో మంగళవారంనాడు పత్రికాగోష్టిలో రాష్ట్ర ప్రభుత్వంచే బళ్లారి జిల్లా పోలీసుశాఖకు ఈ నూతన పరికరాలు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. రోడ్లపై వాహనదారులు అతివేగంగా తమ వాహనాలను నడిపి రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన ఘటనలు పెరుగుతున్నాయి. అతివేగం డ్రైవింగ్‌తో జిల్లాలో ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదం కేసులు పెరిగిపోతున్నాయని చెప్పారు. వీటి నియంత్రణకై పోలీసుశాఖచే స్పీడ్ లేజర్ రాడార్ గన్‌లను అందుబాటులోకి తెచ్చినట్లు, ఈ రాడార్ గన్ సాధనం పూర్తిగా డిజిటల్‌గా పనిచేస్తుందని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ పరికరాన్ని తయారు చేసినట్లు, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన పసిగట్టి తేదీ, సమయం, రాంగ్ రూట్ ప్రయాణం, వాహనాల సౌండ్ డెజిబుల్ సమాచారం, లొకేషన్, వాహనాల రిజిస్టర్ నంబర్ తదితర సమాచారమంతా ఆటోమేటిక్‌గా రికార్డ్ చేయబడుతుందని, తక్షణం ప్రింటర్ ద్వారా రిసిప్ట్‌ను అందజేస్తుందని చెప్పారు. ఈ రాడార్ గన్‌తో ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనకు సంబంధించి అన్నివిధాల కేసులను నమోదు చేయవచ్చని తెలిపిన ఎస్పీ, ఈ పరికరం పోర్టబుల్‌గా ఉంటుందని, అవసరమైన చోట్ల రహదారులపై అమర్చి రికార్డు చేయవచ్చునని చెప్పారు. ఇక మద్యపానం సేవించి వాహనాలు డ్రైవింగ్ చేసే వ్యక్తుల ఫోటోలతో సహ వివరాలు నమోదు చేసే విశిష్ట టెక్నాలజీ కూడా ఈ పరికరంలో ఉన్నదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు తగ్గించే నేపథ్యంలో ఈ పరికరాన్ని ఉపయోగించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత సంవత్సరంలో జూన్ 23వ తేదీ వరకు సుమారు 300 రోడ్డు ప్రమాదాలు జరుగగా, 118 మంది మృత్యువాత పడ్డారని, 436 మంది తీవ్రంగా గాయపడిన వారి సంఖ్య నమోదయ్యిందని తెలిపిన ఎస్పీ, ప్రమాదాల నియంత్రణకు పోలీసుశాఖ ఎప్పటికప్పుడు సార్వజనికులకు జాగృతి కార్యక్రమాలు నిర్వహిస్తూ వివిధరీతుల్లో అవగాహన కల్పించినా హెల్మెట్‌ల వాడకం చేయడంలేదని అసహనం వ్యక్తం చేసిన ఆయన, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన కాకుండా, జిల్లా పోలీసుశాఖ తగు చర్యలు తీసుకుంటుందని వివరించారు.

**- అత్యవసర సేవలకు 112కు కాల్ చేయండి**

సార్వజనికులు తమ పరిసరాల్లో, తమ నివాస ప్రాంతాల్లో ఎటువంటి అల్లర్లు, దౌర్జన్యాలు, దాడులు, చోరీలు, రోడ్డు ప్రమాదాలు జరిగితే అత్యవసర సేవలకు గానూ 112 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసు సేవలు పొందవచ్చునని చెప్పారు. 24 గంటలపాటు ఈ సేవలు సార్వజనికులకు అందుబాటులో ఉంటాయని, ఫిర్యాదులు వచ్చిన 15 నిమిషాల్లోగా ఘటనా స్థలానికి 112 వాహనం చేరుకుంటుందని, అందులో పోలీసులు తక్షణం కార్యరంగంలోకి దిగి చట్టరీత్యా చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ సందర్భంలో ట్రాఫిక్ సీఐ అయ్యన్నగౌడ పాటిల్, స్పీడ్ లేజర్ గన్, బ్రీత్ ఆల్కహాల్ అనలైజర్ పరికరాల పనితీరు గురించి మీడియా ప్రతినిధులకు వివరించారు. ఏఎస్పీ నవీన్‌కుమార్, డీఏఆర్ డీఎస్పీ పి.తిప్పేస్వామి, పోలీసు అధికారులు, ఎస్పీ కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

